సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)
శనివారం । 20 । మే । 2023



చిలకలగుట్టకు రక్షణ వలయం

ములుగు జిల్లాలోని సమ్మక్క తల్లి కొలువుదీరిన చిలుకలగుట్టకు రక్షణ వలయం ఏర్పాటుకు అధికారులు శ్రీకారం చుట్టారు.

- 8లో ▸



21 నుంచి పలు రైళ్ల రద్దు

కాజీపేట-కొండపల్లి రైలు మార్గంలో ఈనెల 21 నుంచి జూన్ 7వ తేదీ వరకు పలు రైళ్లు రద్దు కానున్నాయి.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
$41^0/28^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది

న్యూస్‌రీల్

గెస్ట్ లెక్చరర్ల నియామకానికి ఇంటర్వ్యూలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని విద్యాకళాశాలలో గెస్ట్ లెక్చరర్ల నియామకానికి శుక్రవారం అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 13మంది నియామకానికి ఇటీవల నోటిఫికేషన్ జారీచేయగా 120మంది దరఖాస్తు చేశారని తెలుస్తోంది. వీసీ తాటికొండ రమేష్, రిజిస్ట్రార్ టి.శ్రీనివాస్‌రావు, విద్యాకళాశాల డీన్ టి.రమేష్, సబ్జెక్టు ఎక్స్‌పర్ట్‌తో కలిపి ఇంటర్వ్యూలు నిర్వహించారు.

విదేశాలకు వెళ్లాలనుకునే కార్మికులకు అవగాహన

కాళోజీ సెంటర్: విదేశాలకు వెళ్లాలనుకునే నైపుణ్యం, సెమీ స్కిల్డ్ కార్మికులకు ఈనెల 22న అవగాహన కల్పించనున్నట్లు వరంగల్ జిల్లా ఉపాధి శాఖ అధికారి ఎన్.మాధవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థుల వివరాలు 78935 66493, 99591 09863, 83286 02231 నంబర్లలో సంప్రదించాలని మాధవి కోరారు.

నేడు నిర్విరామ స్వరసంగమం

హన్మకొండ చౌరస్తా: తెలుగు బుక్ ఆఫ్ రికార్డు కోసం ఆర్‌కే గ్రూప్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో శనివారం హనుమకొండలోని అశోకా హోటల్ వేదికగా నిర్విరామంగా స్వరసంగమం జరగనుంది. డాక్టర్ రఘుపాత్రుని జయప్రకాష్, ఎర్రోజు పద్మజలు నాలుగు భాషలకు చెందిన 158 సినిమాల్లోని పాటలను ఉదయం 8 నుంచి రాత్రి 8గంటల వరకు నిర్విరామంగా ఆలపించనున్నారు.

పారదర్శకంగా 'సీఎం కప్'

వరంగల్ స్పోర్ట్స్: సీఎం కప్ క్రీడా పోటీలను పారదర్శకంగా నిర్వహించాలని హనుమకొండ జిల్లా విద్యాశాఖాధికారి అబ్దుల్‌హై సూచించారు. హనుమకొండ ఇండోర్ స్టేడియంలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయంలో పీఈటీ, పీడీలతో శుక్రవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి వివాదాలకు తావులేకుండా నిర్వహించాలని సూచించారు. సమావేశంలో హనుమకొండ జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి గుగులోత్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీన జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో 11 క్రీడాంశాలలో చాంపియన్‌షిప్, మరో ఏడు క్రీడలలో ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

వరంగల్ జిల్లాలో..

కాశిబుగ్గ: మండల స్థాయిలో మూడ్రోజుల పాటు జరిగిన పోటీల్లో గెలుపొందిన వారు ఈ నెల 22 నుంచి 24 వరకు వరంగల్ ఓ సిటీ స్టేడియంలో జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని వరంగల్ జిల్లా క్రీడల అధికారి ఎస్.ఇందిర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు గమనించాలని కోరారు.

బీపీఈడీ మొదటి సెమిస్టర్, మూడవ సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కేయూ పరిధిలో బీపీఈడీ మొదటి సెమిస్టర్, మూడవ సెమిస్టర్ పరీక్షల (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) టైంటేబుల్‌ను విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక తెలిపారు. బీపీఈడీ మూడవ సెమిస్టర్ పరీక్షలు జూన్ 1, 3, 6, 8 తేదీల్లో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తారని పేర్కొన్నారు. మొదటి సెమిస్టర్ పరీక్షలు జూన్ 2, 5, 7, 9 తేదీల్లో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తారని తెలిపారు.

పండుగలా పోటీలు నిర్వహించాలి



హన్మకొండ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ పోటీలను పండుగలా నిర్వహించాలని హనుమకొండ అదనపు కలెక్టర్ సంధ్యారాణి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి పోటీల నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 22 నుంచి 24 వరకు 18 క్రీడాంశాలలో జరిగే జిల్లా స్థాయి పోటీలలో దాదాపు 1,700 మంది క్రీడాకారులు పాల్గొననున్నట్లు తెలిపారు. పోటీల విజయవంతానికి అధికారులతో ఏర్పాటు చేసిన పలు కమిటీల బాధ్యులు నగరంలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియాన్ని సందర్శించి తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ వాసుచంద్ర, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్, డీఎంహెచ్‌ఓ సాంబశివరావు, డీవైఎస్‌ఓ అశోక్ కుమార్, డీఎండబ్ల్యూఓ శ్రీను, డీఈఓ అబ్దుల్ హై, పీడీ మెప్మా భద్రు, జీఎం ఇండస్ట్రీస్ హరిప్రసాద్, డీసీఓ నాగేశ్వర్‌రావు, డీసీపీలు ఎంఏ బారి, కర్ణాకర్, ఏసీపీ కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

చస్తున్నా.. చలనంలేదా!?

మహానగరంలో కుక్కల నియంత్రణపై వీడని నిద్రమత్తు

తాజాగా సంచార బాలుడిని చంపిన శునకాల గుంపు

- అటు బల్దియా యంత్రాంగం, ఇటు ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం
- ఘటనలు జరిగినప్పుడే హడావిడి.. ఆ తరువాత షరామామూలే
- నగరంలో 19వేల కుక్కలు ఉన్నట్లు అంచనా

వరంగల్ అర్బన్: వరంగల్ మహా నగరంలో కుక్కల బెడదపై ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం పదే పదే సమావేశాలు పెట్టి అలా చేయాలి.. ఇలా చేయాలి అనడం తప్ప క్షేత్రస్థాయిలో ఏ ఒక్క పనిని చేయలేని దుస్థితిలో ఉంది. కమిటీలు, చర్యలు తీసుకుంటున్నామని గొప్పలు చెప్పుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు. రోజూ వీధికోక చోట కుక్కలు రెచ్చిపోతున్నాయి. జనానికి నిత్యం కుక్క కాట్లు తప్పడం లేదు.

నగరంలో 19వేల వీధి కుక్కలు

నగరంలో 66 డివిజన్‌లలో 19 వేల వీధి కుక్కలున్నాయని ప్రజారోగ్య అధికారుల పరిశీలనలో తేలింది. అందులో 7వేల కుక్కలు చర్మ వ్యాధుల బారిన పడినట్లు గుర్తించారు. వీటి కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ప్రకటనలు చేశారు. కానీ ఇప్పటి వరకు కార్యాచరణ దిశగా ఏ మాత్రం అడుగులు పడకపోవడంపై ప్రజల పట్ల అధికారులకు,ప్రజాప్రతినిధులకు ఉన్న చిత్తశుద్ధి స్పష్టమవుతోంది. వాస్తవానికి అధికారుల చెబుతున్న లెక్కలకు క్షేత్ర స్థాయిలో ఉన్న కుక్కల సంఖ్యకు తేడా ఉంటోంది. సుమారు 25వేలకు పై చిలుకు ఉన్నట్లు సామాజిక వేత్తలు పేర్కొంటున్నారు.





కాజీపేటలో తిరుగుతున్న కుక్కలు

ఖర్చు ఘనం.. చర్యలు నామమాత్రం

కుక్కలను సంహరించడం చట్టవిరుద్ధం. కుటుంబ నియంత్రణ ద్వారా మాత్రమే వాటిని నిలువరించాల్సి ఉంది. నగరంలో కుక్కల సంతానోత్పత్తిని తగ్గించడమే ఆయుధం. నగరంలో ప్రస్తుతం మూడు బృందాల్లో 12 మంది సిబ్బంది మూడు వాహనాల్లో రోజుకు 25 నుంచి 30 వరకు వరకు వీధి కుక్కలను పట్టుకొని హనుమకొండలోని భీమారం ఎస్‌ఆర్‌ఎస్‌పీ కెనాల్‌కు సమీపంలోని ఆపరేషన్ థియేటర్‌లో శస్త్ర చికిత్సలు చేస్తూ మూడు రోజుల తర్వాత వదిలేస్తున్నారు.



తల్లిదండ్రులు పొట్టకూటికి వలసెళ్తే.. అన్ని ఊళ్లూ తమవే అనుకున్నాడు. ఎండా, వానను ఆస్తులని మురిసిపోయాడు. చెట్టూ, చేమను ఇల్లుగా, అమ్మానాన్నను సంపదగా భావించాడు. రంగురంగుల బొమ్మల నడుమ గమ్మత్తైన బాల్యాన్ని చూశాడు. తాము అమ్మే బొమ్మలవలె.. జీవులన్నీ తమ మిత్రులేనని సంబరపడ్డాడు. విధి రాసిన రాతలో వీధి కుక్కలకు బలయ్యాడు. కుక్కలు పెట్రేగిపోతున్న గ్రేటర్ వరంగల్ నగరంలో, అధికారుల నిర్లక్ష్యపు జబ్బుతో పాలబుగ్గల చిన్నారి బతకడానికి 'చోటు' దక్కలేదు!

- సారీ చోటూ..



రోదిస్తున్న బాలుడి తల్లిదండ్రులు



బాలుడిని చంపిన స్థలం వద్ద రక్తపు మరకలు



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

- గత నెలలో రెడ్డికాలనీ, కాజీపేట ప్రాంతాల్లో ఒకే రోజు 29మందిని కుక్కలు కరవగా ఆ రోజు ఓ బృందం హడావుడిగా ఆయా ప్రాంతాలకు చేరుకుని ఆ కుక్కలను పట్టుకుంది. మరుసటి రోజు కుక్కల పట్టివేత ఊసేలేదు.
- మార్చి ఒకటో తేదీన కాశిబుగ్గలో ఇంటి బయట ఆడుకుంటున్న ఓ బాలుడిని కుక్క నోట పట్టుకుని ఈడ్చుకెళ్తుండగా స్థానికులు అదిలించడంతో వదిలిపారిపోయింది. ఆ రోజు కూడా బృందం రావడం. కుక్కలను పట్టుకుని వెళ్లిపోయింది.
- తాజాగా కాజీపేట జంక్షన్‌లో సంచార బాలుడిని కుక్కల గుంపు చంపివేయడంతో మళ్లీ బల్దియా సిబ్బంది వచ్చి కుక్కలను పట్టుకున్నారు.

..... ఇలా ఏదైనా ఘటన జరిగినప్పుడు హడావుడిగా రావడం.. ఆ రోజు ఏదో కుక్కలను పట్టుకున్నామని ఫొటోలకు ఫోజులిచ్చినట్లు చెప్పుకోవడం తప్ప సీరియస్ నెస్ లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటు బల్దియా అధికారులు, ప్రజాప్రతినిధులు తమ ప్రచారం తప్ప నగరవాసుల ప్రాణాలు పోతే తమకేంటన్న ధోరణిలో ఉన్నారని నగరవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పొంతన లేని ప్రకటనలు

వీధి కుక్కలు వేసవి కాలంలో పెరగడానికి ప్రధానంగా విచ్చల విడిగా మాంసం, చికెన్ వ్యర్థాలు, రెస్టారెంట్లు, హోటళ్లలో మిగిలిపోయిన ఆహారం కారణమని అధికారులు పేర్కొంటున్నారు. అంతేకాకుండా కుక్కలకు నీళ్లు దొరకకపోవడం వల్ల కూడా పిచ్చిపట్టినట్లుగా వ్యవహరిస్తున్నాయని పేర్కొన్నారు. తొట్టెలను ఏర్పాటు చేసిన నీటి సదుపాయం కల్పిస్తామని, మాంసం, చికెన్ వ్యర్థాలు, ఆహార పదార్థాలు వచ్చిలవిడిగా వేయకుండా చర్యలు తీసుకుంటామని, అందుకోసం ప్రత్యేకంగా కమిటీ వేస్తామని 20 రోజుల కిందట బల్దియా ప్రజారోగ్యం అధికారులు స్పష్టం చేశారు. కానీ, ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నంబర్, మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేస్తామని చేయకపోవడం చూస్తుంటే అధికారులు, ప్రజాప్రతినిధులకు ప్రజల ప్రాణాలపై చిత్తశుద్ధి ఏపాటి ఉందో అర్థం చేసుకోవచ్చు. కాజీపేట ఘటన ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది.

పరామర్శ.. రూ.లక్ష ఆర్థికసాయం



బాధితులకు ఆర్థికసాయం అందిస్తున్న వినయ్‌భాస్కర్, సుధారాణి, సుందర్‌రాజ్

వరంగల్: ఎంజీఎం ఆస్పత్రిలో ఉన్న బాలుడు చోటు మృతదేహాన్ని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, గ్రేటర్ మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ సుందర్‌రాజ్‌లు పరిశీలించారు. బాలుడి కుటుంబ సభ్యులను పరామర్శించి దాడి జరిగిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత బాలుడి కుటుంబానికి లక్ష రూపాయల చెక్‌ను అందజేశారు. ఆ కుటుంబాన్ని ఉత్తరప్రదేశ్‌లోని సొంత గ్రామానికి వెళ్లేందుకు అన్ని ఏర్పాట్లను చేస్తున్నట్లు వినయ్‌భాస్కర్ తెలిపారు. రెండు రోజుల క్రితం జరిగిన గ్రేటర్ వరంగల్ పాలకమండలి సమావేశంలో వీధి కుక్కల అదుపు చేసేందుకు చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని మేయర్ గుండు సుధారాణి ప్రకటించారు.

బాలుడిని చంపిన కుక్కల పట్టివేత

కాజీపేట: బాలుడు చోటుపై దాడిచేసి చంపిన ఆరు కుక్కలను మున్సిపల్ అధికారులు పట్టుకున్నారు. మున్సిపల్ వెటర్నరీ వైద్యాధికారి గోపాల్‌రావు, ఎస్సై యాదయ్య, సూపర్‌వైజర్ సాంబయ్య పర్యవేక్షణలో ప్రత్యేక టీం సిబ్బంది వీటిని పట్టుకుంది.

ప్రాణం పోయాక పట్టుకుంటే ఏమి లాభం?

రైల్వే చిన్నపిల్లల పార్కు సమీపంలో తిరుగుతున్న కుక్కలను అధికారులు పట్టుకున్నప్పటికీ మున్సిపల్ సిబ్బంది పనితీరుపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. విలువైన ప్రాణం పోయిన తర్వాత అధికారులు ఎన్ని చర్యలు తీసుకున్నా ఫలితం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



బాలుడిని చంపిన కుక్కలను పట్టుకుంటున్న మున్సిపల్ సిబ్బంది



కుక్కల బెడదపై 'సాక్షి' ముందస్తు హెచ్చరికలు

నగరంలో కుక్కల బెడదపై సాక్షిలో ఎప్పటికప్పుడు హెచ్చరిక కథనాలు ప్రచురిస్తున్నా బల్దియా అధికారుల్లో, ప్రజాప్రతినిధుల్లో కనీసం చలనం ఉండడం లేదు. ఏయే ప్రాంతాల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉంది.. అందుకు గల కారణాలు ఏమిటీ అన్న అంశాలపై చర్చించిన దాఖలాలు లేవు. ప్రజా సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఇవ్వని వారు.. పత్రికల ద్వారానైనా తెలుసుకోలేకపోవడం మన అధికార, పాలక యంత్రాంగం నిర్లక్ష్యానికి నిదర్శనమని నగరవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి పర్యటన రోజే..

కాజీపేట రూరల్: గ్రేటర్ వరంగల్‌లో పలు అభివృద్ధి పనుల పర్యవేక్షణ పరిశీలన నేపథ్యంలో శుక్రవారం మున్సిపల్‌శాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్ కుమార్ వచ్చిన రోజే కాజీపేట రైల్వేకాలనీలో బాలుడిని కుక్కలు చంపిన ఘటన జరగడం గమనార్హం. నగరంలో కుక్కల సమస్య ఎలా ఉందో ముఖ్యకార్యదర్శి కళ్లకు కట్టినట్లు చోటు ఘటన కనిపించింది. ఈ ఘటనను కార్యదర్శి సీరియస్‌గా తీసుకుని బల్దియా యంత్రాంగానికి ప్రత్యేక ఆదేశాలు ఇవ్వాలని నగరవాసులు డిమాండ్ చేస్తున్నారు.

బయటికెళ్లాలంటే భయం..భయం

-8లో ▸

- కాజీపేటలో విజృంభిస్తున్న వీధికుక్కలు
- పది రోజుల్లో ఆరుగురిపై దాడి

నాలుగేళ్లలో 10వేల కుక్కలకు శస్త్ర చికిత్సలు చేసినట్లు అధికార గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

కుక్కలకు చేసిన శస్త్ర చికిత్స ఖర్చు ఇలా.. (రూ.లక్షల్లో)

సంవత్సరం	ఖర్చు
2019-20	50
2020-21	55
2021-22	40
2022-23	90

'రూ.2వేల' రద్దుపై భిన్నాభిప్రాయాలు

ప్రజల్లో గందరగోళం ఏర్పడే అవకాశాలు



హన్మకొండ అర్బన్: రూ.2వేల నోటు రద్దుపై వివిధ వర్గాలనుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నోటు రద్దు విషయంలో ఇలాంటి వార్త వినాల్సి వస్తుందని మొదటినుంచి జనంలో కొంత సందేహం ఉందని కొందరు అంటుండగా అప్పుడు పాత నోట్ల రద్దు నిర్ణయం ప్రభుత్వం చేసిన తప్పిదమా అని మరికొందరు అంటున్నారు. 2016 నవంబర్ 8 అర్ధరాత్రి నుంచి అప్పటి వరకు దేశంలో చలామణిలో ఉన్న రూ.1000, 500 నోట్లు రద్దు చేశారు. చెల్లుబాటు కావని, వాటిని బ్యాంకుల్లో జమచేసి మార్చుకోవాలని స్వయంగా దేశ ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. కొత్తగా రూ.2వేలు, 500నోట్లను తీసుకువచ్చారు. ఈ నోట్లు పేదవాడి చేతికి చేరడానికి చాలా సమయం పట్టింది. ఈ క్రమంలో ఏటీఎంలు, బ్యాంకుల వద్ద బారులో తీరిన దృశ్యాలు మనం చూశాం. అంతా సర్దుకుంటున్న సమయంలో ఆర్‌బీఐ పిడుగులాంటి వార్త చెప్పింది. రూ.2వేల నోట్లు వెనక్కి తీసుకుంటున్నామని, వాటిని ఒక్కొక్కరు 10నోట్లు అంటే రూ.20వేలకు మించకుండా మార్చుకోవచ్చని తెలిపింది. నోట్ల రద్దుపై వివిధ వర్గాల వారు ఏమనుకుంటున్నారో చూద్దాం.

ముందు నుంచి ఊహించిందే..



అప్పుడు పాతవి రద్దు చేసి కొత్తగా రూ.2వేలు, రూ.500 తీసుకువచ్చారు. దానికి మళ్లీ ఇప్పుడు వెనక్కి తీసుకుంటున్నారు. ఇలాంటి నిర్ణయాలు ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తాయి. రూ.2వేల నోటు వచ్చినప్పుడే దీనిని రద్దు చేస్తారని సామాన్యుడిలో సందేహం మొదలైంది. ఇప్పుడు అదే జరిగింది.

- అన్నమనేని జగన్మోహన్‌రావు, టీజీఓస్ ఉమ్మడి జిల్లా సమన్వయకర్త

అప్పటి నిర్ణయం తప్పు అన్నట్లా...?



2016 నవంబర్ 8న పాత నోట్లు రద్దు చేసి కొత్తగా రూ.2వేలు, రూ.500నోట్లు తెచ్చారు. ప్రస్తుతం మళ్లీ రూ.2వేల నోట్లు వెనక్కి తీసుకుంటామన్నారు. అంటే ఆ రోజు ప్రభుత్వం, ఆర్‌బీఐ తీసుకున్న నిర్ణయం తప్పు అని ప్రజలు భావించాల్సి ఉంటుంది. పేద, మధ్య తరగతి వారికి పెద్దగా నష్టం లేకపోయినా ప్రజల్లో గందరగోళానికి దారితీసే అవకాశాలు ఉన్నాయి.

- గనిపాక రాజ్‌కుమార్, టెస్సా జిల్లా అధ్యక్షుడు

ప్రజలు హర్షించరు



గతంలో అర్ధరాత్రి నోట్ల రద్దు ప్రకటించిన నాటి రోజులు ప్రజలు ఇంకా పూర్తిగా మర్చిపోలేదు. అప్పుడే ఆ నోట్లు మళ్లీ వెనక్కి అంటున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు ఎంత మంది చావులు చూస్తుందో. ఎవరి ప్రయోజనాల కోసం ఈ నిర్ణయాలు అన్న విషయం ప్రజలకు చెప్పాలి. పరోక్షంగా అయినా పేదలకు ఇబ్బందులు తప్పవు. కేంద్రం, ఆర్‌బీఐ తీసకునే ఇలాంటి నిర్ణయాలు ప్రజలు హర్షించరు.

- మానస రాంప్రసాద్, 49వ డివిజన్ కార్పొరేటర్

డిజిటల్ పేమెంట్స్ పెరిగాయి...



నోట్ల రద్దు సమయంలో అన్ని వర్గాలవారు తీవ్ర ఇబ్బందులు పడిన మాట వాస్తవం. క్రమంగా జనం డిజిటల్ పేమెంట్స్‌కు అలవాటు పడ్డారు. మాకు రోజులో 70శాతం యూపీఐ ద్వారా పేమెంట్స్ జరుగుతాయి. ప్రస్తుతం రూ.2వేల నోటు రద్దు అన్నది సామాన్యులపై పెద్దగా ప్రభావం చూపకపోవచ్చు. కొద్ది మొత్తం ఉన్నా మార్చుకోవడానికి టైం ఉంటుంది కాబట్టి ఇబ్బంది లేదు.

- కుమార్, పాన్‌షాప్, హనుమకొండ

ఇన్‌స్పెక్టర్ నరేందర్‌పై సస్పెన్షన్ వేటు

హెడ్ కానిస్టేబుల్ వెంకటయ్యపై కూడా..



నరేందర్



వెంకటయ్య

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇన్‌స్పెక్టర్, హెడ్ కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు వేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. కాజీపేట సబ్ డివిజన్ పరిధిలోని హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన ఇన్‌స్పెక్టర్ నరేందర్ హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని సీతంపేట భూతగదా విషయంలో ఒక వర్గం నుంచి డబ్బులు తీసుకుని మరో వర్గాన్ని ఇబ్బందులకు గురి చేశారనే ఆరోపణలపై నెల రోజుల క్రితం వీఆర్‌కు అటాచ్ చేస్తు సీపీ ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై సీపీ.. అధికారులతో విచారణ చేయించారు. మరికొంత మంది బాధితులు నేరుగా సీపీని కలిసి వారికి జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీంతో ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి పలు అంశాలపై విచారణ చేపట్టారు. ముఖ్యంగా దేవన్నపేట, వంగపహడ్, సీతంపేట, బావుపేట గ్రామాల్లో జరిగిన భూ తగాదాల విషయాలతోపాటు పీడీఎస్ బియ్యం తదితర అంశాలపై విచారణ జరిగినట్లు తెలిసింది. ఇందులో ఇన్‌స్పెక్టర్ నరేందర్ పెద్దఎత్తున అవినీతికి పాల్పడినట్లు నిర్ధారణ కావడంతో ఆయనపై వేటు పడినట్లు సమాచారం. అదేవిధంగా జనగామ జిల్లా రఘునాథపల్లి పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బాస్కుల వెంకటయ్య ఫిర్యాదుదారులనుంచి డబ్బులు వసూలుతోపాటు ఇటీవల సస్పెండ్‌కు గురైన సబ్ ఇన్‌స్పెక్టర్ వీరేందర్ చెప్పిన విషయాల్లో డబ్బులు వసూల్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. కొంతమంది ఫిర్యాదుదారులపై అక్రమంగా కేసులు పెట్టినట్లు ఫిర్యాదులు వచ్చాయి. దీంతో పూర్తిస్థాయి విచారణ చేపట్టి ఇద్దరిపై సస్పెన్షన్ వేటు వేసినట్లు తెలిసింది.

ఒక్క కాలనీ నీటిలో మునగకుండా చర్యలు

- వేగంగా నాలుగు స్టేడియాల నిర్మాణం
- ఇంటింటికీ మిషన్ భగీరథ నీరు
- అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయండి
- చీఫ్‌విప్ వినయ్ భాస్కర్, ఎంఐయూడీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్



అభివృద్ధి పనులపై సమీక్షిస్తున్న వినయ్‌భాస్కర్, అరవింద్‌కుమార్, కలెక్టర్లు తదితరులు

నయింనగర్: వర్షాకాలంలో ఒక్క కాలనీ కూడా వరద ముంపునకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని, వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్, ఎంఐయూడీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్‌లు ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ కుడా కార్యాలయం సమావేశ మందిరంలో మేయర్ సుధారాణి, కుడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్యలతో కలిసి జీడబ్ల్యూఎంసీ, కుడా, రెవెన్యూ, పబ్లిక్ హెల్త్, ఇరిగేషన్ అధికారులతో పలు పథకాల కింద చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు. జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో నాలుగు నియోజకవర్గాల పరిధిలో రూ.5కోట్ల వ్యయంతో చేపడుతున్న నాలుగు స్టేడియాల నిర్మాణాలు, ముంపునకు గురికాకుండా కార్యాచరణ ప్రణాళిక అమలు, సివిరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ల ఏర్పాటు, కాజీపేట జంక్షన్ విస్తరణ అభివృద్ధి పనులు, డ్రెయిన్లు, డక్ట్‌ల నిర్మాణ పనుల పురోగతి, మల్టీపర్పస్ కమ్యూనిటీ హాళ్ల ఏర్పాటు, నాలాల ఆడిట్ తదితర పనుల పురోగతిని సమీక్షించి అన్ని పనులు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. కుడా ఆధ్వర్యంలో చేపడుతున్న కాళోజీ కళాక్షేత్రం, వరంగల్ బస్‌స్టేషన్ నవీకరణ, భద్రకాళి మాడవీధుల ఏర్పాటు, ఇన్నర్ రింగ్ రోడ్, హనుమకొండ బస్‌స్టేషన్ నవీకరణ, కాకతీయ మ్యూజికల్ గార్డెన్ పునరుద్ధరణ పనుల ప్రగతిని సమీక్షించారు. గ్రేటర్ వరంగల్‌లో మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు రూ.10కోట్లు వెచ్చించి అవసరమైన స్లీవ్‌వాల్స్, పైప్‌లైన్ల ఏర్పాటు, లీకేజీలు అరికట్టి ఫ్లో మీటర్‌లు ఏర్పాటు చేసి అన్ని ప్రాంతాల్లో చివరి ఇంటివరకు రోజూ నీరందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలు నీటిలో మునగకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. తాగునీటి సరఫరాకు ఇబ్బందులు ఉన్న 51 కాలనీల్లో మిషన్ భగీరథ రెండోవిడతలో నీటిని సరఫరా చేయడానికి ప్రతిపాదనలు వెంటనే సమర్పించాలన్నారు. వరద ముంపు నివారణ చర్యల్లో భాగంగా రూ.234కోట్లతో చేపడుతున్న రిటైనింగ్ వాల్స్, డక్ట్ పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తిచేయాలన్నారు. వరంగల్ ఇన్నర్ రింగ్ రోడ్‌కు అవసరమైన భూ సేకరణ ప్రక్రియ పూర్తయినందున వెంటనే టెండర్ ప్రక్రియ పూర్తి చేసి నిర్మాణ పనులను వచ్చే నెలలో ప్రారంభించేలా చూడాలన్నారు. మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ గ్రేటర్ వరంగల్‌లో తాగునీటి సరఫరా నిర్వహణలో సిబ్బంది కొరత ఉందని, ప్రతిపాదించిన 125 మందిని నాక్ ద్వారా త్వరగా నియమించాలని కోరారు. ముంపు నివారణ నిధుల అంశాన్ని మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అంతకుముందు కాళోజీ కళాక్షేత్రం పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన అరవింద్ కుమార్ అధిక మెన్ అండ్ మెటీరియల్ పెంచి ఆగస్టు 15 కల్లా పూర్తి కావాలని ఆదేశించారు. అదేవిధంగా కాజీపేట చౌరస్తాలో పలు ప్రాంతాలను పరిశీలించారు. మూడు నెలల్లోపు చౌరస్తా రూపు రేఖలు మారిపోయేలా అభివృద్ధి పనులను చేపట్టి పూర్తి చేసి చూపిస్తామని తెలిపారు. సమీక్షలో రెండు జిల్లాల అదనపు కలెక్టర్లు తానాజీ, సంధ్యారాణి, వివిధశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

21 నుంచి పలు రైళ్ల రద్దు



డోర్నకల్: కాజీపేట– కొండపల్లి రైలు మార్గంలో మూడో లైన్ నిర్మాణ పనులతోపాటు, చింతపల్లి, నెక్కొండ స్టేషన్ల మధ్య పనులు జరగనుండటంతో ఈ నెల 21 నుంచి జూన్ 7వ తేదీ వరకు కాజీపేట –విజయవాడ మార్గంలో పలు రైళ్లు రద్దు కానున్నాయి.

రద్దు కానున్న రైళ్ల వివరాలు:

07753 కాజీపేట– డోర్నకల్
07754 డోర్నకల్– కాజీపేట
07755 విజయవాడ– డోర్నకల్
07756 డోర్నకల్– విజయవాడ
07464 విజవాడ– గుంటూరు
07465 గుంటూరు– విజయవాడ
17660 భద్రాచలంరోడ్– సికింద్రాబాద్
17659 సికింద్రాబాద్– భద్రాచలంరోడ్
12713 విజయవాడ– సికింద్రాబాద్
12714 సికింద్రాబాద్– విజయవాడ
07091 కాజీపేట–తిరుపతి
(మే 23, 30, జూన్ 6న రద్దు)
07092 తిరుపతి– కాజీపేట
(మే 23,30, జూన్6న రద్దు)
07185 మచిలీపట్నం– సికింద్రాబాద్
(మే21, 28, జూన్ 4న రద్దు)
07186 సికింద్రాబాద్– మచిలీపట్నం
(మే21, 28, జూన్ 4న రద్దు)

తాత్కాలికంగా రద్దయ్యే రైళ్లు..

- సిర్పూర్ టౌన్– భద్రాచలం(17034) 20వ తేదీ నుంచి 6వ తేదీ వరకు వరంగల్, భద్రాచలం మధ్య రద్దు
- భద్రాచలం-సిర్పూర్ టౌన్(17033) 21వ తేదీ నుంచి జూన్ 7వ తేదీ వరకు భద్రాచలం, వరంగల్ మధ్య రద్దు
- బెలగావి– మణుగూరు(07335) 20వ తేదీ నుంచి జూన్ 6 వరకు కాజీపేట, మణుగూరు మధ్య రద్దు
- మణుగూరు– బెలగావి(07336) 21వ తేదీ నుంచి జూన్ 7 వరకు మణుగూరు, కాజీపేట మధ్య రద్దు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.

కేయూ భూ కబ్జాపై అధికారుల సీరియస్

హసన్‌పర్తి: కాకతీయ యూనివర్సిటీ భూముల కబ్జాను అధికారులు సీరియస్‌గా పరిగణించారు. ఈమేరకు రెండు రోజుల క్రితం యూనివర్సిటీ పరిధి లష్కర్ సింగారం సర్వే నంబర్ 32/బిలో కిష్టయ్య అనే వ్యక్తి మరికొంత మందితో కలిసి చదును చేయడం ప్రారంభించారు. సమాచారం అందుకున్న యూనివర్సిటీ అధికారులు అక్కడికి చేరుకొని అడ్డుకోవడంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈమేరకు కేయూ రిజిస్ట్రార్ ఆచార్య శ్రీనివాస్‌రావు గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రిజిస్ట్రార్ ఫిర్యాదు మేరకు కిష్టయ్యతోపాటు మరికొంతమందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజ్‌కుమార్ శుక్రవారం వెల్లడించారు.

కడిపికొండ భూమి టీఎన్జీవోస్‌దే..!

- ఉద్యోగుల సొసైటీ భూమి వదిలే ప్రసక్తేలేదు
- రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు సిద్ధం
- ఉమ్మడి వరంగల్ జిల్లా ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులు



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగ సంఘాల ప్రతినిధులు

హన్మకొండ అర్బన్ : ప్రభుత్వ ఉద్యోగుల నివాస స్థలాల కోసం సీఎం కేసీఆర్ కడిపికొండలో కేటాయించిన భూమిలోకి వెళ్లిన ప్రభుత్వ ఉద్యోగుల పై దుర్భాషలాడుతూ భౌతిక దాడులకు పాల్పడిన అసాంఘిక శక్తులను కఠినంగా శిక్షించాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఉద్యోగులు విరామ సమయంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట జేఏసీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున నిరసన చేపట్టారు. నిరసనలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ మాట్లాడుతూ.. సీఎం ఉద్యోగుల ఇంటి స్థలాల కోసం కడిపికొండలో కేటాయించిన 32 ఎకరాల స్థలంలో కబ్జాల విషయం గతంలోనే కలెక్టర్, పోలీస్ కమిషనర్, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఉద్యోగులకు కేటాయించిన భూమిని పరిశీలించేందుకు వెళ్లిన ఉద్యోగులపై కొంత మంది దుర్భాషలాడుతూ భౌతిక దాడులకు పాల్పడ్డారని, ఈవిషయాన్ని ఉద్యోగ సంఘాల ఏజేసీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఉద్యోగుల భుమి ఆక్రమణకు పోత్సహిస్తున్న వారు తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందన్నారు. ఈవిషయంలో ఎవరినీ ఉపేక్షించేదిలేదని స్పష్టం చేశారు. దోషులను శిక్షించే వరకు ఉద్యమిస్తామన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రేక్షక పాత్ర వహిస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేసేందుకు సిద్ధమని తెలిపారు. గెజిటెడ్ అధికారుల సంఘం ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ అన్నమనేని జగన్ మోహన్‌రావు మాట్లాడుతూ ఉద్యోగులకు ప్రభుత్వం కేటాయించిన భూమిని ఎట్టి పరిస్థితుల్లో వదులుకునేది లేదన్నారు. సీఎం స్వయంగా ఇచ్చిన ఆదేశాలను బేఖాతర్ చేస్తున్న కొంతమంది అధికారుల వైఖరి వల్ల ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతున్నాయన్నారు. వెంటనే కలెక్టర్, సీపీ ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించి ఉద్యోగుల భూమి అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీఎన్జీఓ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గజ్జెల రామ్‌కిషన్, వేణుగోపాల్, బూరుగు రవి, ములుగు జిల్లా అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, నాగరాజు, హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు లక్ష్మణరావు, సభ్యులు వేణుగోపాల్, రమేష్, అశోక్, శ్యాంసుందర్, వెంకట్రామ్‌రెడ్డి, సారంగపాణి, భూక్యా రాము, డాక్టర్ ప్రవీణ్, సురేష్, బింగి సురేష్, రాజేష్‌ఖన్నా, రాజీవ్, అనుప్, భరత్, ప్రణయ్, రాజ్యలక్ష్మి, పావని, శ్రీలత, కల్పన తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

- లైసెన్స్ షాపుల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలి
- వ్యవసాయధికారి విజ్ఞాన్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్



ఎరువులు, విత్తన షాపులో తనిఖీ చేస్తున్న అధికారులు

ఖిలా వరంగల్: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయధికారి జి. విజ్ఞాన్, మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ హెచ్చరించారు. వ్యవసాయాధికారుల సూచనల మేరకు లైసెన్స్ ఉన్న షాపుల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. శుక్రవారం వ్యవసాయ, పోలీస్ శాఖ సంయుక్తంగా వరంగల్ ఫోర్ట్ రోడ్డులో ఎరువులు, విత్తన దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. షాపుల్లో అందుబాటులో ఉన్న పత్తి, మొక్క జొన్న, మిర్చి, ఇతర పంటల విత్తనాల ప్యాకెట్లు, పురుగు మందులను పరిశీలించారు. సుమారు 25 విత్తనాల షాపులను తనిఖీ చేసి రికార్డులు, విత్తనాల విక్రయాల అనుమతులు, కంపెనీ గుర్తింపును అడిగి తెలుసుకున్నారు. పలు షాపుల్లో విత్తన నమూనాలను పరిశీలించారు. నిషేధిత విత్తనాల విక్రయాలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్, ఏఓ విజ్ఞాన్ మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దని, లైసెన్స్ గల షాపుల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. బ్రోకర్ల మాయమాటలు నమ్మొద్దని, లూజు పత్తి విత్తనాలను విక్రయిస్తున్న వారివద్ద రైతులు విత్తనాలు కొనుగోలు చేసి నష్టపోవద్దని సూచించారు. లైసెన్స్ ఉన్న డీలర్ల వద్ద మేలైన విత్తనాలు కొనుగోలు చేసి బిల్లు తీసుకోవాలని, పంట ముగిసే వరకూ భద్రపర్చుకోవాలని చెప్పారు. పంట దిగుబడులు రానిచో డల అధికారులకు తెలిపి పరిహారం పొందే అవకాశం ఉందన్నారు. విత్తన బ్రోకర్ల మాటలు నమ్మొద్దని వ్యవసాయాధికారులు సూచించిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేసి మంచి దిగుబడులు సాధించాలన్నారు. నిబంధనలు అతిక్రమించి నాణ్యతలేని విత్తనాలు విక్రయిస్తే డీలర్లపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు సుమన్, సాంబయ్య, కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి చంద్రకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

‘నిట్’ల బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న నిట్ వరంగల్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ

కాజీపేట అర్బన్: దేశ వ్యాప్తంగా 31 నిట్‌ల బలోపేతానికి కృషి చేసేందుకు నిట్ వరంగల్‌లోని బోస్ సెమినార్ హాల్‌లో శుక్రవారం టు వర్డ్స్ ఎఫెక్టీవ్ మేనేజ్‌మెంట్ ఆఫ్ నిట్స్ అనే అంశంపై జాతీయ స్థాయి వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేశారు. నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ జాతీయ స్థాయి వర్క్‌షాప్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి, మాట్లాడారు. దేశవ్యాప్త నిట్‌లను ప్రపంచ స్థాయికి తీర్చిదిద్దేందుకు పరస్పర అవగాహనతో ముందుకు సాగాలని అన్నారు. నిట్‌ల బలోపేతానికి దేశవ్యాప్త నిట్‌లను ఏకం చేసేందుకు నిట్ వరంగల్ ముందడుగు వేసిందని తెలిపారు. దేశవ్యాప్తంగా ఇంజనీరింగ్ కళాశాల ప్రారంభోత్సవంలో 1959లో తొలి ఇంజనీరింగ్ కళాశాలగా నాడు ఆర్ఈసీ నేటి నిట్ దేశ వ్యాప్త 31 నిట్‌లకు పెద్దన్నగా నిలుస్తుందని నిట్ రూర్కేలా రిటైర్డ్ డైరెక్టర్, ప్రొఫెసర్ సునీల్‌కుమార్ సారంగి తెలిపారు. న్యూ ఎడ్యుకేషనల్ పాలసీ-2020 అనుగుణంగా విద్యాభోదనకు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో నిట్ రూర్కేలా డైరెక్టర్ ఉమామహేశ్వర్‌రావు, నిట్ వరంగల్ రిజిస్ట్రార్ గోవర్ధన్‌రావు, ప్రొఫెసర్లు వీరాంజనేయులు, దేశవ్యాప్త నిట్‌ల డైరెక్టర్లు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో బదిలీలు..?

- సోమవారం ఉత్తర్వులు వెలువడే అవకాశం

కాజీపేట అర్బన్ : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సబ్ రిజిస్ట్రార్లతో పాటు జిల్లా రిజిస్ట్రార్ల బదిలీలకు రంగం సిద్ధమైనట్లు విశ్వసనీయ సమాచారం. ఈ మేరకు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ , రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్లతో కూడిన ఓ కమిటీ బదిలీల ప్రక్రియపై కసరత్తు ప్రారంభించనట్లు తెలిసింది. కాగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలకు చెందిన గ్రేడ్-1, గ్రేడ్-2 మూడేండ్లు నిండిన సబ్ రిజిస్ట్రార్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు జిల్లా రిజిస్ట్రార్ హైదరాబాద్‌కు బదిలీ అయ్యే అవకాశం ఉంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో శుక్రవారం బదిలీల సమాచారం చర్చనీయాంశంగా మారింది. దీంతో కొందరు బదిలీలకు బ్రేక్ ఇచ్చేందుకు పావులు కదుపుతున్నట్లు వినికిడి.

గంజాయి విక్రయదారు అరెస్టు



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

వరంగల్: ఎల్‌బీ నగర్‌లోని జియా మసీదులో ప్రైవేటు ఉద్యోగిగా పనిచేస్తూ.. వరంగల్ బస్టాండ్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్న అమన్ హజీజ్ అనే వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. గంజాయి అమ్మకాలు, వినియోగం గురించి అందిన విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇంతేజార్‌గంజ్ పోలీసులతో కలిసి కమిషనర్ టాస్క్ ఫోర్స్ వరంగల్ బస్టాండ్ సమీపంలో గంజాయి విక్రయాలు, వినియోగంలో పాల్గొంటుండగా హజీజ్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. అతని వద్ద నుంచి కిలో 200గ్రాముల ఎండు గంజాయి, మొబైల్ ఫోన్, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. హజీజ్ గత ఏడాది నుంచి గంజాయి విక్రయాలు, సేవించడం అలవాటు చేసుకుని, వరంగల్ రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి నుంచి గంజాయిని కొనుగోలు చేసి చిన్న ప్యాకెట్లలో నింపి విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైందని తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం ఇంతేజార్‌గంజ్ పోలీసులకు నిందితున్ని అప్పగించినట్లు పేర్కొన్నారు. ఈదాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు కె.శ్రీనివాసరావు, కె.జనార్దన్‌రెడ్డి, ఎస్సైలు లవన్‌కుమార్, నిస్సార్‌పాషా, బి.శరత్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాలను వినియోగించుకోవాలి

- నగర మేయర్ గుండు సుధారాణి



బల్దియా కార్యాలయం ఆవరణలో ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మేయర్ సుధారాణి

వరంగల్ అర్బన్: చెత్త రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ (ఆర్‌ఆర్‌ఆర్) కేంద్రాలను వినియోగించుకోవాలని నగర మేయర్ గుండు సుధారాణి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం బల్దియా ప్రధాన కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాన్ని మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ శాఖ స్వచ్ఛ సర్వేక్షన్– 2023లో భాగంగా ‘మేరీ లైఫ్ మేరా స్వచ్ఛ షేహర్’ పేరుతో శనివారం నుంచి జూన్ 5వ తేదీ (పర్యావరణ దినోత్సవం) సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమం లో స్థానిక డివిజన్ కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి, అడిషనల్ కమిషనర్ రవీందర్ యాదవ్, డిప్యూటీ కమిషనర్ అనిసుర్ రషీద్, సీఎంహెచ్‌ఓ రాజేష్, ఎస్ ఈ ప్రవీణ్ చంద్ర, అధికారులు, సిబ్బంది, ఆర్‌పీలు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా - డ్రైవర్ మృతి



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

కాజీపేట అర్బన్: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి చెందిన ఘటన శుక్రవారం కాజీపేట మండలం అమ్మవారిపేటలో చోటు చేసుకుంది. స్థానికులు, మడికొండ పోలీసుల వివరాల ప్రకారం.. గ్రేటర్ వరంగల్ 44వ డివిజన్ తిమ్మాపూర్‌కు చెందిన మల్లెపాక కుమారస్వామి (45) అల్లీపూర్‌కు చెందిన రాజు వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. పనిలో భాగంగా శుక్రవారం ఉదయం అమ్మవారిపేట చెరువు కట్ట మీద నుంచి వెళ్తున్న క్రమంలో ట్రాక్టర్ అదుపుతప్పి చెరువులో పడింది. సమీపంలోని రైతులు ట్రాక్టర్, డ్రైవర్ కుమారస్వామిని బయటకు తీశారు. కానీ, అప్పటికే కుమారస్వామి మృతి చెందాడు. మృతుడికి భార్య మరియ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారస్వామి భార్య ఫిర్యాదు మేరకు మడికొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇళ్ల పట్టాలు వచ్చేవరకు పోరాడతాం

- సీపీఎం నేత నాగయ్య



నినాదాలు చేస్తున్న నాగయ్య, నాయకులు

కరీమాబాద్: పేదల ఇళ్లకు పట్టాలు వచ్చే వరకు పోరాడతామని సీపీఎం కేంద్ర కమిటీ నాయకుడు జి.నాగయ్య అన్నారు. ప్రతీ పేదవాడికి కూడు, గూడు కోసం పోరాడేది సీపీఎం పార్టీయేనన్నారు. కరీమాబాద్ సీపీఎం ఏరియా కమిటీ ఆధ్వర్యంలో భట్టుపల్లి రోడ్‌లోని రాజీవ్ గృహకల్ప కాలనీలోని గుడిసెల ప్రాంతాన్ని శుక్రవారం సీపీఎం నాయకులు సందర్శించారు. పార్టీ జెండా ఆవిష్కరణ చేసి కాలనీకి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం నగర్‌గా నామకరణం చేశారు. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడుతూ.. పేదలు వేలాది రూపాయల కిరాయిలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ భూముల్లో పేదలు వేసుకున్న గుడిసెలకు సంబంధించి ఎన్నికల వాగ్దానం ప్రకారం జీఓ 58 ద్వారా పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇళ్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పిన పాలకుల మాటలు హామీలకే పరిమితమైందని విమర్శించారు. ఇచ్చిన హామీలను తుంగలోతొక్కి మరోసారి పేదలను మోసం చేయడానికి కుటిల బుద్ధితో పాలకవర్గాలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. పోరాటాల ద్వారానే హక్కుల సాధన సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. గుడిసెల పోరాటంలో మహిళలదే కీలకపాత్ర ఉంటుందని చెప్పారు. దేశంలో, రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, లైంగిక దాడులు జరుగుతున్న నేపథ్యంలో వాటికి వ్యతిరేకంగా మహిళలు ముందుండి పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రంగయ్య, రత్నమాల, ముక్కెర రామస్వామి, సాగర్, యాదగిరి, బషీర్, అరుణ్‌కుమార్, మధుకర్, మల్లయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య ఆశయాలతో ముందుకెళ్లాలి

ఖిలా వరంగల్: భారత దేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలతో సీపీఎం శ్రేణులు, యువత ముందుకెళ్లాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు నాగయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం వరంగల్ శంభునిపేటలో ఓ ఫంక్షన్ హాలులో సీపీఎం రంగశాయిపేట ఏరియా కమిటీ కార్యదర్శి మాలోతు సాగర్ అధ్యక్షతన పుచ్చలపెల్లి సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, మాట్లాడారు. కార్మికుల కూలి రెట్ల పెంపు కోసం ఉద్యమాలు చేసిన ఘన ఆయనకే దక్కిందన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన ఆశయాలను మరింత ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రంగయ్య, ప్రత్యూష, సాంబమూర్తి, గణేపాక ఓదెలు, లక్క రమేష్, రత్నం దాసు ,జ్యోతి, గజ్జ చందు, ఉసిల్ల కుమార్ పాల్గొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

కాజీపేట రూరల్: కాజీపేట టౌన్ రైల్వేస్టేషన్ సమీపంలోని వడ్డెపల్లి చెరువు కట్ట రైల్వే ట్రాక్ వద్ద శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కాజీపేట జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ దయాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం .. సుమారు 59 ఏళ్ల వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు 5.4 ఎత్తు, చామన ఛాయ, తెలుపు రంగు చొక్కాపై ఎరుపు గీతల లైన్లు, బూడిద రంగు ప్యాంట్, ఎడమ చేతిపై డీఏఆర్ అని పచ్చబొట్టు ఉందని, మృతదేహాన్ని వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనుమానం ఉన్న వారు వివరాలకు కాజీపేట జీఆర్పీ పోలీస్ స్టేషన్ సెల్ నంబర్ 94932 01968 ద్వారా సంప్రదించాలని హెడ్‌కానిస్టేబుల్ దయాసాగర్ సూచించారు.

చిలకలగుట్టకు రక్షణ వలయం

- ఫెన్సింగ్ ఏర్పాటుకు శ్రీకారం
- పూజలు నిర్వహించిన పూజారులు, అధికారులు



చిలకల గుట్ట (ఫైల్)



పూజలు చేస్తున్న ట్రైబల్ ఈఈ హేమలత

ఎస్ఎస్ తాడ్వాయి: ములుగుజిల్లాలోని ఎస్ఎస్ తాడ్వాయి మండలంలో సమ్మక్క తల్లి కొలువుదీరిన చిలకలగుట్టకు రక్షణ వలయం ఏర్పాటుకు అధికారులు శ్రీకారం చుట్టారు. చిలకల గుట్టపై కొలువుదీరిన సమ్మక్క తల్లిని పూజారులు ప్రతీ రెండేళ్లకు ఒకసారి కుంకుమ భరణి రూపంలో గద్దె పైకి తీసుకొస్తుంటారు. తల్లి కొలువుదీరిన పవిత్ర గుట్టకు రక్షణగా అధికారులు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటుకు తల్లివారం (ఈనెల 18) గురువారం పూజారులు, అధికారులు కలిసి పూజలు నిర్వహించారు. గతంలో కొంతమేరకు ఫెన్సింగ్ ఏర్పాటు చేసి వదిలేశారు. గుట్టకు ఫెన్సింగ్ పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని మంత్రులు, అధికారులను పూజారులు ప్రతి జాతరలో కోరుతున్నారు. ఎట్టకేలకు ఫెన్సింగ్ ఏర్పాటుకు అధికారులు శ్రీకారం చుట్టడంతో పూజారులు, భక్తుల కల నెరవేరనుంది.

రూ.60లక్షల నిధులు..

ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో చిలకలగుట్ట చుట్టూ 425 మీటర్ల పొడవున ఇనుప ఫెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు రూ.60 లక్షల నిధులను మంజూరు చేశారు. ఈ నిధులతో గుట్ట చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు పనులు చేపట్టేందుకు సిద్ధమైయ్యారు. సమ్మక్క తల్లి కొలువుదీరిన గుట్టపైకి భక్తులు, స్థానిక ప్రజలు ఎక్కడం వల్ల అపవిత్రం అవుతుందని పూజారుల నమ్మకం. గత నాలుగు జాతరల క్రితం గుట్ట చుట్టూ కొంత మేర (600 మీటర్ల) వరకు జాలి ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. మిగిలిన ఫెన్సింగ్ పనులు ఈ సారి పూర్తి చేయనున్నారు. 2024, ఫిబ్రవరిలో జరిగే మహాజాతరకు ముందుగానే ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో చిలుకలగుట్టకు రక్షణ కవచం పనులు మొదలయ్యాయి. దీంతో తల్లి గుట్టకు రక్షణ లభించనుంది.

పవిత్రమైన గుట్టను కాపాడేందుకే..

సమ్మక్క తల్లి స్వయాన కొలువు ఉన్న చిలకలగుట్ట పైకి భక్తులు, ప్రజలు ఎక్కేందుకు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. అంతే కాకుండా గుట్టపై వనమూలికలు కూడా ఉన్నాయని, వాటిని సేకరించేందుకు కొందరు గుట్టను ఎక్కేందుకు ప్రయత్నిస్తుంటారు. మహాజాతర సమయంలో మిగతా రోజుల్లో వచ్చే భక్తులు చిలుకలగుట్ట వద్ద సేదతీరి వంటావార్పు చేసుకుంటే మోక్షం కలుగుతుందని విశ్వాసం. దీంతో భక్తులు ఎక్కువ మంది గుట్ట పరిసరాల్లో విడిది చేస్తుంటారు. భక్తులు, ఇతరులు గుట్ట పరిసరాల్లో వేసిన వ్యర్థాలు, మలమూత్ర విసర్జన చేయడంతో అపరిశుభ్రంగా తయారవుతాయి. ఫెన్సింగ్ ఏర్పాటుతో ఎవరు కూడా గుట్టపైకి వెళ్లేందుకు వీలుండదు. ఫెన్సింగ్ ఏర్పాటుతో సమ్మక్క సారలమ్మ పూజారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు పర్యవేక్షించాలి..



చిలుకలగుట్ట చుట్టూ పూర్తిస్థాయిలో ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ పెద్దలు, అధికారులకు విన్నవించగా, ఇప్పటికి కార్యరూపం దాల్చడంతో పూజారుల కల నెరవేరనుంది. మహాజాతర సమయంలో చిలుకలగుట్ట పైకి పూజారులు తప్ప మిగతా ఎవరు కూడా వెళ్లకూడదు. కానీ ఇన్ని రోజులు ఫెన్సింగ్ లేకపోవడంతో మేడారానికి వచ్చే భక్తులు గుట్టపైకి ఎక్కేందుకు ప్రయత్నించడంతో గుట్ట అపవిత్రమవుతుంది. ఫెన్సింగ్ పటిష్టంగా ఉండేలా అధికారులు పనులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి.

– సిద్దబోయిన జగ్గారావు, పూజారుల సంఘం అధ్యక్షుడు